క్లుప్తంగా

మండలంలో 26,449 మందికి కంటి పరీక్షలు

ధర్మారం: మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో 26,449 మందికి పరీక్షలు నిర్వహించినట్లు మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనుదీప్ తెలిపారు. జనవరి 18 నుంచి మే 15 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించామని, మండల వ్యాప్తంగా 12477 మంది పురుషులు, 13964 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 3,753 మందికి రీడింగ్ అద్దాలు, 2,727 ప్రిస్కిప్షన్ అద్దాలు అందించినట్లు తెలిపారు. 1235 మందికి ఆపరేషన్ నిమిత్తం కరీంనగర్‌కు రెఫర్ చేసినట్లు వివరించారు.

ధూళికట్టలో 176 మందికి నేత్ర పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో కంటి వెలుగులో సోమవారం 176 మందికి పరీక్షలు నిర్వహించి 26 మందికి కళ్లద్దాలను అందజేశారు. సర్పంచ్ గొల్లె కావేరి, ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న అభిమానులు

ఎలిగేడు: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గీట్ల ముకుందరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం మండలంలోని నారాయణపల్లిలో చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు గొడుగులు పంపిణీ చేశారు. గీట్ల అభిమానులు తాటిపల్లి సతీశ్ బాబు, కాసర్ల రాజు, లచ్చయ్య, రామస్వామి, గాదె అంజిరెడ్డి, దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేత

కమాన్‌పూర్: రామగిరి మండలం ఆదివారంపేట గ్రామానికి చెందిన ముత్యాల సతీశ్‌కు జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరి రాజు తెప్పించిన గ్రూప్స్, జూనియర్ లెక్చరర్ పరీక్ష పుస్తకాలను రామగిరి తహసీల్దార్ రామ్మోహన్ చేతుల మీదుగా అందజేశారు.

కందకాల పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

కమాన్‌పూర్ : రామగిరి మండలంలోని రత్నాపూర్‌లో కందకాల పనులను సోమవారం సర్పంచ్ పల్లె ప్రతిమ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రావు, వార్డు సభ్యులు కెక్కర్ల ఉష, కుంట సదాలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, గౌడ సంఘం అధ్యక్షుడు ముక్కెర కిష్టస్వామి, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

ఎలిగేడు: మండలంలోని 15 నుంచి 35 ఏళ్లలోపు ఆసక్తిగల క్రీడాకారులు సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస మూర్తి తెలిపారు. సుల్తాన్‌పూర్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉదయం 6.30 గంటలనుంచి పీఈటీలు అందుబాటులో ఉంటారని, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉపాధి వేటలో ఆగిన గుండె

మల్యాల: ఉపాధి కోసం 20 ఏళ్ల క్రితం గల్ఫ్ బాట పట్టిన వలసజీవి అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు కృషిచేయాలని బాధిత కుటుంబ సభ్యులు కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ చాంద్‌పాషాకు విన్నవించారు. మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన లింగాల ముత్తయ్య(55) ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. ఇటీవల దుబాయ్‌లో పనిచేసే చోట గుండె నొప్పి రావడంతో ఆస్పత్రిలో చేరి, చికిత్సపొందుతుండగా, కాంగ్రెస్ రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ చాంద్‌పాషా అక్కడి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి, చికిత్సకు సహకరించారు. ఆదివారం తెల్లవారుజామున ముత్తయ్య చికిత్సపొందుతూ మృతిచెందినట్లు సన్నిహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో చాంద్‌పాషా బాధిత కుటుంబాన్ని కలిసి ఓదార్చారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు కృషిచేయాలని కుటుంబ సభ్యులు కోరడంత అక్కడి ఎంబసీ కార్యాలయానికి లేఖరాసి, మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు కృషిచేస్తానని చాంద్‌పాషా హామీ ఇచ్చారు.

మండుటెండలో నిరీక్షణ..!

- సన్నబియ్యం కోసం లబ్ధిదారుల క్యూ..
- మండలంలో 7,800 రేషన్ కార్డులు
- పోర్ట్‌తో ఇబ్బంది పడుతున్న డీలర్లు



మండల కేంద్రంలోని రేషన్ దుకాణం వద్ద ఎండలో నిల్చున్న లబ్ధిదారులు

కమాన్‌పూర్ : రేషన్ దుకాణాల్లో బియ్యం ఇస్తున్నారంటే చాలు.. బారులుతీరి బియ్యం తీసుకునేందుకు ఎగబడతారు. అందులో సన్న బియ్యం ఇస్తున్నారంటే చాలు ఉదయమే షాపుల వద్ద చెప్పులు, సంచులను పెట్టి వెళ్తుంటారు. మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా గంటల కొద్దీ క్యూలైన్‌లో ఉండి బియ్యం తీసుకుంటున్నారు.

మండలంలో 16 రేషన్ దుకాణాలు..

మండలంలోని కమాన్‌పూర్, గుండారం, జూలపల్లి, పెంచికల్‌పేట, నాగారం, రొంపికుంట, పేరపల్లి, గొల్లపల్లె, సిద్దిపల్లె తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలో 16 రేషన్ షాపులుండగా సుమారు 7,800 బియ్యం కార్డులున్నాయి. రేషన్‌కార్డులో ఎంతమంది కుటుంబ సభ్యులుంటే ఒక్కొక్కరికి ఆరుకిలోలు, అన్నపూర్ణ కార్డుకు పదికిలోలు, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. కరోనా సమయంలో ఒక్కొక్కరికి 15 కిలోల బియ్యం పంపిణీ చేయగా ప్రస్తుతం సన్న బియ్యం ఆరు కిలోలు మాత్రమే పంపిణీ చేయడంతో అవి ఎటుసరిపోవని, గతంలో పంపిణీ చేసిన విధంగా 15 కిలోలు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. మార్కెట్లో సన్న బియ్యానికి ధర ఎక్కువగా ఉండడంతో రేషన్ దుకాణాల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యం తీసుకునేందుకు అన్నివర్గాల ప్రజలు క్యూ కడుతున్నారు.

గ్రామాలకు దూరంగా రేషన్ షాపులు..

మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల్లో 16 రేషన్ షాపులున్నాయి. గ్రామాల దూరంగా రేషన్ షాపులు ఉండడంతో లబ్ధిదారులు బియ్యం తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పాటైన సిద్దిపల్లెలో రేషన్ దుకాణం లేకపోవడంతో గ్రామానికి చెందిన లబ్ధిదారులు మండలకేంద్రంలో బియ్యం తీసుకునే పరిస్థితి నెలకొంది. జూలపల్లి గ్రామ పరిధిలోని ముల్కలపల్లి గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంది. ముల్కలపల్లి వాసులకు తిప్పలు తప్పడం లేదు. ప్రతీ గ్రామంలో ఐదువందల కార్డులకు ఓ రేషన్ షాపు ఏర్పాటు చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటివరకు అమలు కాకపోవడంతో రేషన్ తీసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పోర్ట్‌తో ఇబ్బందులు..

లబ్ధిదారులు బియ్యం తీసుకునేందుకు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం పోర్ట్ (ఎక్కడైనా రేషన్ తీసుకునే విధానం) ప్రవేశపెట్టింది. దీంతో బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు అందుబాటులో ఉన్న రేషన్ షాపులకు వెళ్లి బియ్యం తీసుకుంటుండంతో డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. రేషన్ దుకాణాలకు సన్నబియ్యం సరఫరా చేయడంతో డీలర్ల వద్ద రేషన్ క్లోజ్ అవుతుండగా రేషన్ తీసుకునే వారు డీలర్లు డీఎస్‌వోకు పోర్ట్ పెడుతున్న సమయానికి బియ్యం సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఎర్రటెండలో నిల్చున్న



రేషన్‌షాపులో ఈనెల సన్నబియ్యం ఇస్తున్నారని తెలిసింది. బియ్యం తీసుకునేందుకు ఉదయం వచ్చి లైన్‌లో నిల్చున్న. గంట పాటు మండుటెండలో నిలబడి ఆరు కిలోల బియ్యం తీసుకున్నా.

– మడ్డి రాజేశ్వరి, కమాన్‌పూర్

15 కిలోలు ఇవ్వాలి



గతంలో ఇచ్చిన ప్రకారం ఒక్కో లబ్ధిదారుడికి 15 కిలోల చొప్పున బియ్యం అందజేయాలి. ఆరుకిలోల బియ్యం ఏ పూటకు సరిపోవడం లేదు. కనీసం పది కిలోలైనా ఇస్తే బాగుంటుంది.

– బుర్ర చిలకమ్మ, కమాన్‌పూర్

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు, ప్రత్యేకాధికారి

సాక్షి నెట్‌వర్క్: పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లోని ఆయా మండల కేంద్రాల్లో సోమవారం సీఎం కప్ క్రీడా పోటీలను ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహకం అందించేందుకు పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, ప్రతిభ కనబర్చిన వారికి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి, అక్కడి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. క్రీడా పోటీలు 17 వరకూ జరుగుతాయన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ప్రభుత్వం పోటీలు నిర్వహిస్తోందని, ప్రతిభను మెరుగుపరుచుకోవడంతోపాటు గ్రామాలకు పేరు తీసుకురావాలని, ప్రతి ఏడాది యువకులు క్రీడల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. పలుచోట్ల క్రీడాకారులను ఉత్సాహపరచడానికి ప్రజాప్రతినిధులు, నాయకులు క్రీడాకారులతో కలిసి ఆటలు ఆడారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ రేణుక దేవి



క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



రంగంపల్లిలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా బస్తీ దవాఖాన

- పెద్దపల్లిలో రెండు బస్తీ దవాఖానాలు ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

పెద్దపల్లి రూరల్: ప్రజారోగ్య సేవలు మరింత చేరువకానున్నాయి. పెద్దపల్లి మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత పరిసర గ్రామాలైన రంగంపల్లి, చందపల్లి, బందంపల్లితో పాటు పెద్దకల్వల, పెద్దబొంకూర్‌లోని కొంతభాగం మున్సిపల్‌లో విలీనమైన విషయం విధితమే. మున్సిపల్ పరిధి పెరిగి ఇదివరకు ఉన్న 20 వార్డులను 36 వార్డులకు పెంచారు. ఆయాప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వీలుగా పెద్దపల్లిలో ఇప్పటికే ఓ అర్బన్ పీహెచ్‌సీని ప్రారంభించారు.

నేడు ప్రారంభం

పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రంగంపల్లి, చందపల్లిలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తూ వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇదివరకు ఆయా గ్రామాల్లో ఉన్న పంచాయతీ భవనాల్లోనే కొత్తగా ఏర్పాటు కానున్న బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసేలా ముస్తాబు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి చేతుల మీదుగా బస్తీ దవాఖానాలు ప్రారంభం కానున్నాయి.

సిబ్బందిని నియమించాం



పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో కొత్తగా బస్తీ దవాఖానాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటి ద్వారా సేవలను అందుబాటులోకి తెస్తున్నాం. అందుకు అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాం. ఈ దవాఖానా ద్వారా మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందుతాయి.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌ఓ, పెద్దపల్లి

సుల్తాన్‌పూర్‌లో బీరప్ప ఉత్సవాలు



మైక్‌సెట్‌ను అందజేస్తున్న ఏగోలపు సదయ్యగౌడ్

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో కుర్మసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరన్న ఉత్సవాల్లో బీరన్న పట్నం వేశారు. ఈ సందర్భంగా బీర్ల పూజారులు బీరప్ప కథ చెప్పారు. ఉత్సవాలకు బీజేపీ నాయకుడు ఏగోలపు సదయ్య గౌడ్ హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని ఆలయానికి మైక్‌సెట్‌ను అందజేశారు. కురుమ సంఘం అధ్యక్షుడు అప్పాల పోచాలు, పెద్దకుర్మ కొమురయ్య, జారతగొండ రాయుడు, ఎల్కపల్లి ఓదెలు అప్పాల రాజయ్య, ఐలయ్య, రవి, సమ్మయ్య, బండారి సింగయ్య, బీజేపీ నాయకులు గంగయ్య, మనోహర్, సతీశ్‌గౌడ్, మహేశ్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న నడిగొట్టు సంపత్

కమాన్‌పూర్: మంథని పట్టణంలో మంగళవారం బీపీ మండల్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ బీసీ మండల అధ్యక్షులు నడిగొట్టు సంపత్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి అన్ని వర్గాల బీసీలు తరలిరావాలన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మేకల సంపత్, గడువ కృష్ణమూర్తి, పెండ్లి నారాయణ, రాసకొండ రవి, కొమురయ్య, బంగారు గట్టయ్య, పొట్ల శంకర్, బత్తిని శ్రీనివాస్, చిందం తిరుపతి పాల్గొన్నారు.

నేడు సీఎం కప్ క్రీడాపోటీలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం నుంచి చీఫ్ మినిస్టర్ కప్–2023 మండల స్థాయి క్రీడా పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమ్యలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని ఇన్‌చార్జి కమిషనర్ చిన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్‌లో భాగంగా 100 మీ, 200మీ పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్‌తోపాటు ఖో ఖో, ఫుట్‌బాల్‌తో పాటు రెండో రోజు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా పోటీలు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు.

'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి'

పెద్దపల్లి రూరల్: వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇవ్వాలని జర్నలిస్ట్ యూనియన్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద సోమవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, మహేశ్ పలు రాజకీయ పార్టీల నాయకులు, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాజేందర్, ఈర్ల కొమురయ్య, శ్రీమాన్, చంద్రశేఖర్, రియాజ్, అన్వేష్, చంద్రమౌళి, అశోక్ జగన్, భిక్షపతి, సుదర్శన్, వినోద్, సాబీర్ పాషా, రవి, రమేశ్, గోపి, సతీశ్, సుమన్ తదితరులున్నారు.

వైద్యశిబిరం ప్రారంభం

కమాన్‌పూర్ : రామగిరి మండలంలోని కల్వచర్లలో భవన నిర్మాణ కార్మికుల కోసం భవన నిర్మాణ సంక్షేమ మండలి సీఎస్సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారం సర్పంచ్ గంట పద్మ ప్రారంభించారు. లేబర్ కార్డు కలిగి ఉన్నవారికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సహాయ కార్మిక శాఖ అధికారి మెరుగు శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి, సీఎస్సీ జిల్లా ఇన్‌చార్జి తిరుపతి, కో ఆర్డినేటర్ రవితేజ, జిల్లా కోశాధికారి షరీఫ్, మండల శాఖ అధ్యక్షుడు చంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణారెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

పోలీసుల అదుపులో దొంగ

కోరుట్ల: పట్టణంలో ఈనెల 11న చోరీకి పాల్పడిన దొంగను కోరుట్ల పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే ఈనెల 11న హాజీపురకు చెందిన రిజ్వాన్, ఇమ్రాన్ అనే ఇద్దరి ఇళ్లల్లో చోరీ జరిగింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమరాల ఆధారంగా దొంగను గుర్తించారు. అల్లమయ్య గుట్టకు చెందిన మహమ్మద్ ముజాహిద్ (25)గా గుర్తించి అతడిని ఇంటివద్ద అరెస్టు చేసి విచారించగా చోరీచేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మహమ్మద్ ముజాహిద్ వద్ద నుంచి 2,5 తులాల బంగారం, 6 తులాల వెండి, రూ. 5వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో మరో 8 చోట్ల చోరీకి పాల్పడినట్లు ముజాహిద్ ఒప్పుకున్నాడని, మరింత సమాచారం రాబడుతున్నామని సీఐ వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఇళ్లల్లో సీసీ కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండాకాలం సేద తీరేదెలా?

- భగభగ మండుతున్న ఎండలు
- విద్యాసంస్థలకు సెలవులు
- అయినా తెరుచుకోని ఈతకొలనులు

'రాహుల్ ఎనిమిదో తరగతి పూర్తయ్యింది. సమ్మర్ సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకుందామనుకుని ఆశపడ్డాడు. కానీ సిమ్మింగ్‌పూల్‌లో నీళ్లు లేకపోవడంతో రోజూ వచ్చి నిరాశతో తిరిగి వెళ్తున్నాడు. ఇది ఒక రాహుల్ సమస్య కాదు. గోదావరిఖని ప్రాంతంలోని సింగరేణి కార్మిక కుటుంబాల్లోని చిన్నారుల వేదన. గాంధీనగర్ ప్రాంతంలో స్విమ్మింగ్‌పూల్ ఉన్నప్పటి అది చిన్నది కావడంతో రద్దీ ఎక్కువ ఏర్పడింది. మూసివేసిన స్విమ్మింగ్ పూల్ తెరిపించేందుకు సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోదావరిఖని(రామగుండం): అసలే ఓ వైపు మండుతున్న ఎండలు.. మరోవైపు ఉక్కపోత.. ఇలాంటి పరిస్థితుల్లో కూల్‌కూల్‌గా సిమ్మింగ్ చేయడం అంటే ఎవరికీ ఇష్టం ఉండదు. సరదాగా ఈతకొడుదామంటే గోదావరిఖని ప్రాంతంలో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌ను వినియోగంలోకి తేవడం లేదు. ఆర్జీ–1 అధికారుల నిర్లక్ష్యంతో గత ఐదు నెలలుగా సిమ్మింగ్‌పూల్ నిరుపయోగంగా ఉంటోంది. గోదావరిఖని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం ప్రాంగణంలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సిమ్మింగ్‌పూల్ నిరుపయోగంగా మారింది. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి సంస్థలోనే అత్యధిక కార్మిక కుటుంబాలు నివసిస్తున్న గోదావరిఖని ప్రాంతంలో సిమ్మింగ్‌పూల్ నిరుపయోగంగా మారింది.

రంగుమారిన నీటితో ఇబ్బందులు

గోదావరినది నుంచి వచ్చే నీటితో సిమ్మింగ్‌పూల్‌లో నీటిని నింపుతుంటారు. రంగుమారిన నీటిని సిమ్మింగ్‌పూల్‌లో నింపేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో డిసెంబర్ 24న నీటిని తొలగించిన తర్వాత మళ్లీ నింప లేదు. ఈక్రమంలో ప్రత్యేక బోర్‌వెల్ వేసి స్విమ్మింగ్‌పూల్‌లో నీళ్లు నింపాలని స్థానికులు కోరుతున్నారు. అదే అధికారుల బంగ్లాస్ ఏరియాలో సిమ్మింగ్‌పూల్‌లో రెండు బోర్‌లు వేసిన అధికారులు కార్మికుల సిమ్మింగ్‌పూల్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.



మూసి ఉన్న స్విమ్మింగ్ పూల్ గేట్

మూడు రోజుల్లో మరమ్మతు చేస్తాం



మూడురోజుల్లో సిమ్మింగ్‌పూల్ తెరిచేలా చర్యలు తీసుకుంటా. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పైప్‌లైన్ కోసం పనులు చేయాలని ఆదేశించాం. గోదావరి నది నుంచి వచ్చే పైపులైన్‌తో అనుసంధానిస్తున్నాం. సమస్య పరిష్కరించేందుకు జియాలజిస్ట్ సూచనలమేరకు ప్రత్యేక బోర్‌వెల్ వేస్తాం.

– చింతల శ్రీనివాస్, జీఎం, ఆర్జీ–1

మిత్రుడికి ఆర్థికసాయం



మహేందర్‌కు నగదు అందిస్తున్న మిత్రులు

రుద్రంగి(వేములవాడ): పక్షవాతం వచ్చి అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని అప్పుల పాలైన క్లాస్‌మెట్‌కు తోటి మిత్రులు చేయూతనందించారు. ఉపాధి కోసం సౌదీ వెళ్లిన తోటి మిత్రులు, కలిసి పని చేసిన మరికొందరు మిత్రులు సౌదీలో రూ.లక్ష విరాళం సేకరించి గడ్డం మహేందర్‌కు ఆర్థికంగా అండగా నిలిచారు. రుద్రంగిలోని క్లాస్‌మెట్స్‌తో నగదును మహేందర్‌కు అందించారు. ఆస్పత్రి ఖర్చులతో అప్పుల పాలైన నిరుపేద మహేందర్ కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఆర్థికసాయం అందించిన వారిలో రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌లో 1991–92 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఉన్నారు.

పరామర్శ

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలం నిట్టూరులో సింగిల్‌విండో చైర్మన్ మోహన్‌రావు కూతురు రజని ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను మండలి చీఫ్ విప్ భాను ప్రసాద రావు సోమవారం పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.